క్లుప్తంగా

శభాష్ సుందరం



ఇందిరానగర్ నుంచి గర్భిణీని కేజీహెచ్‌కు తీసుకు వెళ్తున్న ఆటో డ్రైవర్ సుందరం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన గర్భిణీని ఉచితంగా కేజీహెచ్‌కు తీసుకెళ్లి తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నాడు ఆటో డ్రైవర్ సుందరం. ఇది ఆయనకు నిత్య కృత్యమే... స్థానిక ఆశావర్కర్లు, ఏఎన్ఎంలకు విధి నిర్వహణలో సీరియస్ కేసులు వచ్చినప్పుడు ఆ రోగులను ఆస్పత్రికి చేర్చాలంటే ఆటో సుందరం గుర్తు వస్తాడు. అయితే ప్రస్తుతం ఆయన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ సమయంలో కూడా గర్భిణి పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని చెప్పగానే స్పందించి కేజీహెచ్‌కు తీసుకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న స్థానికులు సుందరం శభాష్ అంటూ కొనియాడారు.

నేటి నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలు



దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి శ్రీరాజరాజేశ్వరీదేవి పీఠంలో సోమవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకూ వారాహి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి రోజు అమ్మవారికి వారాహి అభిషేకం, కుంకుమ పూజ,అష్టమాతృక అభిషేకం,యంత్ర పూజ, జపంతో పాటు సాయంత్రం హోమం నిర్వహిస్తారన్నారు. అలాగే ప్రతీరోజు ఉచిత అన్న సమారాధన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువత

సింహాచలం: అడవివరంలోని నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఆర్.ఆర్. కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించిన ఈశిబిరంలో 185 మంది రక్తదానం చేశారు. మదర్ బ్లడ్ బ్యాంక్, చత్రపతి బ్లడ్ సెంటర్, విశాఖ బ్లడ్ సెంటర్, అమ్మ బ్లడ్ బ్యాంక్‌లకు చెందిన వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు, వినోద్, చైతన్య పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంట్ల కిరణ్‌బాబు, ఎన్. అప్పారావు, నవయువ సేవా సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వరరావుకు స్వాగతం పలుకుదాం

ఉక్కునగరం: అంతర్జాతీయ కార్మిక సమాఖ్య జెనీవాలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో భారతదేశ ప్రతినిధిగా పాల్గొని సోమవారం తిరిగి వస్తున్న బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. జగదీశ్వరరావుకు ఘన స్వాగతం పలకడానికి బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎయిర్‌పోర్టుకు తరలిరావాలని బీఎంఎస్ నాయకులు కోరారు. ఆదివారం ఉక్కునగరంలో జరిగిన బీఎంఎస్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సదస్సులో భారత్‌లోని కార్మికుల సమస్యలను, సోషల్ సెక్యూరిటీపై ఉపన్యసించి కార్మిక వాణిని ప్రపంచ దేశాలకు వినిపించారన్నారు. ఆయనను ఎయిర్ పోర్టు నుంచి గాజువాక, కూర్మన్నపాలెం మీదుగా ర్యాలీగా తీసుకురానున్నామన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షులు రొక్కం సురేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి శరగడం రామ చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జ్ లాలం ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జ్ రాందాస్ నరేంద్ర, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎస్. నాయుడు, చింతా రమణ పాల్గొన్నారు.

నాణ్యత లోపమా.. భారీ వాహనాలే కారణమా!

- ఏడాది గడవక ముందే రోడ్డు శిథిలం
- ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు



సోమినాయుడుపాలెం రోడ్డులో గోతులు



పెచ్చులూడుతున్న వాడచీపురుపల్లి రహదారి

పరవాడ: రోడ్డు పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారా..! సామర్థ్యానికి మించి భారీ వాహనాలు రాకపోకలు సాగించడమే తెలియదు కాని ఆరోడ్డు వేసి ఏడాది గడవక ముందే శిథిలమైంది. ఎక్కడికక్కడ పెచ్చులూడిపోతోంది. ఫలితంగా ఆమార్గంలో ప్రయాణించే ఉద్యోగులు, పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

హిందూజా, సింహాద్రి ఎన్టీపీసీ పరిశ్రమలకు బొగ్గు, యంత్ర సామగ్రి, భవన మెటీరియల్‌ను తరలించడానికి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పలు రహదారులు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా లంకెలపాలెం–కలపాక రహదారి, ఊటగెడ్డ–వాడచీపురుపల్లి, సింహాద్రి వై జంక్షన్–సోమునాయుడుపాలెం రహదారులు గోతుల మయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం రూ.60 లక్షలతో ఊటగెడ్డ–ఎన్టీపీసీ రోడ్డు నిర్మించింది. రోడ్డు పూర్తి చేసి ఏడాది తిరక్కముందే ముక్కలైంది. ఈ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపం వల్లే ఇలా జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో పలు పర్యాయాలు రోడ్డు ధ్వంసమైంది. దీంతో కాంట్రాక్టర్ పైపై మెరుగులు దిద్ది మమా అనిపించారు. నిత్యం కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులతో రద్దీగా ఉండే రోడ్ల పనుల్లో కూడా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఊటగెడ్డ నుంచి ఎన్టీపీసీ వరకు నిర్మించిన బీటీ రోడ్డు ఎక్కడికక్కడ పెచ్చులుగా ఊడిపోతుంది. సోమునాయుడుపాలెం రహదారిలో కూడా భారీ వాహనాల రాకపోకలతో గుంతల మయంగా మారింది. చీకటి పడితే ఈ రెండు రోడ్లలో ప్రయాణం కత్తిమీద సాముగా మారుతోంది. తరచూ ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముమ్మన దేముడు

సింహాచలం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలిస్తున్నారని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా మూడో ఏడాది వైఎస్సార్ ఆసరా నగదు జమ చేసిన సందర్భంగా ఆదివారం వార్డు పరిధి కృష్ణరాయపురంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ముమ్మన దేముడు క్షీరాభిషేకం నిర్వహించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అలాగే రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంగటి సూరిబాబు, బొడ్డు దేముడు బాబు, ఉమా మహేష్, చాణక్య, సీతారామ్, గోపాల్, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి



పైడివాడ అగ్రహారంలో రైతులకు ఈకేవైసీ చేయిస్తున్న ఏవో సత్యనారాయణ తదితరులు

సబ్బవరం: పీఎం కిసాన్ లబ్ధిదారులంతా విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు.మండలంలోని పైడివాడ అగ్రహారంలో ఆదివారం పీఎం కిసాన్ లబ్ధిదారులకు ఈకేవైసీ చేయడంతో పాటు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో 10 వేల మంది వరకూ పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉండగా ఇప్పటికే 8,500 మందికి ఈకేవైసీ పూర్తిచేశామన్నారు. మిగిలిన రైతులంతా ఈకేవైసీ చేయించుకునే విధంగా సమాచారం అందిస్తామన్నారు. రైతులంతా రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ముఖ ఆధారితం ద్వారా లేని పక్షంలో లబ్ధిదారుల ఫోన్ నంబర్లకు వచ్చిన ఓటీపీని గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయడం ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.లేని పక్షంలో నగదు జమకాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు,గ్రామ వ్యవసాయ సహాయకులు హరీష్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలకు నమస్కరిస్తున్న భక్తులు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో తీరంలో సేదదీరడానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఆదివారం ఉదయాన్నే తీర ప్రాంతాలకు చేరిన పర్యాటకులు మధ్యాహ్నం వరకు ఇసుక తిన్నులపై కాలక్షేపం చేశారు. భోజనం చేసిన తర్వాత తీరంలో ఆట పాటలతో ఎంజాయ్ చేశారు. సముద్ర జలాల్లో జలకాలాటలతో సందడి చేశారు.

ఘనంగా భువనేశ్వరీదేవి అధివాసం



ప్రత్యేక అలంకరణలో భువనేశ్వరీదేవి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చెల్లయ్యమ్మతోటలో కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మంగళస్నానాలు చేయించారు. దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మండలానికి ఒక సారి నిర్వహించే అధివాసంలో ఒక్కో అధివాసం రోజు ఒక్కో పత్రితో పూజలు నిర్వహిస్తారు.దీనిలో భాగంగా ఆదివారం ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో పలు పత్రిలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ దర్శించుకున్నారు.భువనేశ్వరీదేవి సంస్థాన్ ట్రస్టు నిర్వాహకులు సురేష్ రాజ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేసి సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను పల్లకీలో అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట : విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణి పేట, ములగాడ, గోపాలపట్నం తదితర ప్రాంతాల తహసీల్దార్ల కార్యాలయాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజలు 0891–2562977 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలి.

గంగవరం పోర్టు ఉద్యోగులకు న్యాయం చేస్తాం



ఎమ్మెల్యేను కలిసిన గంగవరం పోర్టు ఉద్యోగులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాల విషయంలో పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో పోర్టు యాజమాన్యంతో పాటు జిల్లా కలెక్టర్‌తో కలసి సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. గంగవరం పోర్టు ఉద్యోగులు తమ సమస్యలపై ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనుతో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఏకరువు పెట్టారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉక్కు పోరాటం ఆగదు



857వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తూ పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు ఉక్కు పోరాటం ఆగదని స్టీల్ హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద స్టీల్ హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు ఆధ్వర్యంలో 857వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ప్లాంట్‌ను నష్టాల్లో నడుపుతున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు అనూహ్య స్పందన



ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

బీచ్ రోడ్డు: విదేశాల్లో విద్యాభ్యాసంపై అవగాహన కోసం ఐవీ ఓవర్సీస్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2023కు విశేష స్పందన లభించింది. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ డాక్టర్ స్వామి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలా మందికి ఉన్నా.. ఎలా ప్రవేశం పొందాలి, ఏ విద్యా సంస్థలు మంచివి అనే అంశాలు తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్‌కు చెందిన 33 ప్రముఖ యూనివర్సిటీలు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు హాజరై సుమారు 300 మంది విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐవీ సంస్థ వ్యవస్థాపకులు బి.రామ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, మార్కెట్ హెడ్ వెంకట రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు

ఫుట్‌బాల్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి అందజేస్తున్న జియ్యాని శ్రీధర్, దాసరి సత్తిబాబు

సింహాచలం: వైఎస్సార్‌సీపీ 93వవార్డు అధ్యక్షుడు, దివంగత దాసరి రాజు జ్ఞాపకార్థం విరాట్‌నగర్‌లోని ఏపీఈపీడీసీఎల్ గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి వైఎస్సార్ ఫుట్‌బాల్ కప్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 స్కూళ్ల నుంచి 16 జట్లు ఈటోర్నీలో పాల్గొన్నాయి. విశాఖ వ్యాలీ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు, వినోద్, 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు నడింపల్లి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రథయాత్ర వీక్షణకు బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్

మహారాణిపేట: ఈ నెల 20 నుంచి పది రోజుల పాటు జరగనున్న జగన్నాథ రథయాత్రలో పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద గల దేవదాయ శాఖ కార్యాలయ ఆవరణలో ఆదివారం దేవదాయ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, 1098 చైల్డ్‌లైన్, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతేడాది ఉత్సవాల్లో ఎంత మంది బాలలు రథోత్సవాన్ని తిలకించారని దేవాలయ ఈవో రాజగోపాలరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ కూడా కిట్లు, పారా మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. దివ్యాంగ బాలలకు ప్రత్యేక దర్శనం కల్పించేందుకు ట్రై సైకిళ్లతోపాటు ప్రత్యేక దర్శన లైన్లు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కమిషన్ సూచనల ప్రకారం బాలలకు సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ డేవిడ్ రాజు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి రమణకుమారి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ఆదరించాలి



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న బాలకొండలరావు

దాబాగార్డెన్స్: సంప్రదాయ కళలకు ప్రాధాన్యమివ్వాలని నృత్య కళాకారిణి ఏబీ బాలకొండలరావు అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నాట్య పరిమళ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీతం, నృత్యంపై ఆదివారం నిర్వహించిన నైపుణ్య శిక్షణలో విజేతలుగా నిలిచిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. సభాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ సనాతన సంప్రదాయంలో భాగమైన కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వంకాయల సన్యాసిరాజు సంస్థ ద్వారా కళా రంగానికి సేవలందిస్తున్న లిపికారెడ్డి, డాక్టర్ వై. బాలగణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో చెన్నా తిరుమలరావు, పి.శిలత కృష్ణ, సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్వ రోగ నివారిణి యోగా

అల్లిపురం: యోగా సర్వరోగ నివారిణిగా పని చేస్తుందని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి బీకే రాజేశ్వరి అన్నారు. ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు ముఖ్యమైన యోగాసనాలు, రెండు రకాల ప్రాణాయామాల గురించి వివరించారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ అమెరికాలో జరిగే యోగా దినోత్సవంలో 180 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఓంయోగా కేంద్రం ప్రతినిధి రమేష్, శాంతి యోగా కేంద్రం ప్రతినిధి సుబ్బారావు, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు లలితాదేవి, వేణు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలు ప్రారంభం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అల్లిపురం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా 11వ మహా సభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని పక్కన పెట్టి మత విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని అమలు చేయలేదన్నారు. ఎస్వీ యూనివర్సిటీ మాజీ లెక్చరర్ క్షేత్రపాల్ మాట్లాడుతూ దేశంలోయువత భవిష్యత్తు, ఉద్యోగ, ఉపాధి కోసం ఏఐవైఎఫ్ జెండా చేతపట్టి సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.